డబ్బాలు, కంటైనర్లు ఏర్పాటు చేసి అద్దెకు

- ఫిలింనగర్ కొత్త చెరువు చుట్టూ వెలిసిన ఆక్రమణలు
- చెరువు శిఖం భూమిని ఆక్రమించి వ్యాపారాలు
- ఫుట్‌పాత్ వ్యాపారాలకు రెంటల్ అగ్రిమెంట్లు
- విస్తుపోతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

బంజారాహిల్స్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నగరంలో చిన్నపాటి ఖాళీ స్థలం కనిపించినా సొంతం చేసుకునేందుకు ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ముఖ్యంగా రోడ్లు, పార్కులకు ఆనుకొని ఉన్న స్థలాలను ఆక్రమించి ఫుట్‌పాత్ వ్యాపారాలకు అద్దెకిస్తున్న వైనాలు అనేకం ఉన్నాయి. ఈ క్రమంలోనే చెరువు శిఖం భూమిని కబ్జా చేసిన కొందరు ఏకంగా డబ్బాలు, కంటైనర్‌లను ఏర్పాటు చేసి వేల రూపాయలకు అద్దెకిస్తున్నారు. ఇందుకోసం రెంటల్ అగ్రిమెంట్‌లు సైతం ఇస్తుండటంతో ఆక్రమణదారులు ఏ స్థాయి వరకు వెళ్లారో అనేది స్పష్టమవుతోంది. రాజకీయ నేతలు, బస్తీ నాయకులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది కనుసన్నల్లోనే ఈ వ్యాపారం సాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిలింనగర్ కొత్త చెరువు వద్ద జరుగుతున్న ఈ అక్రమ దందాకు కొంత మంది ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

ఉమ్మడి రాష్ట్రంలో చెరువు అభివృద్ధి

ఫిలింనగర్ బస్తీల మధ్య ఉన్న కొత్త చెరువుకు గతంలో ఎటువంటి రక్షణ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. అనేక మంది ప్రమాదవశాత్తు జారి పడి మరణించారు. దీంతో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం కొత్త చెరువు రక్షణను కట్టుదిట్టం చేయడంతో పాటు సుందరీకరణ చేపట్టాలని భావించింది. ఈ మేరకు నిధులు కేటాయించడంతో పనులు మొదలయ్యాయి. సుమారు రెండు సంవత్సరాల పాటు సుదీర్ఘంగా పనులు సాగాయి. చివరకు చెరువు చుట్టూ చక్కటి ప్రహరీ, పచ్చని వాతావరణాన్ని కల్పించారు. ఈ ప్రహరీకి ఆనుకొని రెండు వైపులా రాకపోకలు సాగించేందుకు రోడ్డును అందుబాటులోకి తీసుకువచ్చారు. పర్యాటకులు వచ్చే విధంగా సకల సదుపాయాలు కల్పించారు.

అద్దె రూ.30 వేలకు పై మాటే

ఇక్కడ వ్యాపారాలు చేసుకునే వారి వద్ద నాయకులు ఒకొక్కరి వద్ద ప్రతినెలా సుమారు 30 వేల రూపాయల అద్దె వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఓ ప్రాంతీయ పార్టీకి చెందిన నాయకుడు మూడు డబ్బాలు పెట్టి ప్రతినెలా సుమారు లక్ష రూపాయలు అద్దె వసూలు చేస్తున్నాడు. ఇక అక్రమంగా తిష్టవేసిన కొందరు ఏకంగా షాపులకు జీహెచ్‌ఎంసీ నంబర్లు పెట్టి తామే స్థల యజమానులమని చెబుతూ రెంటల్ అగ్రిమెంట్ సైతం ఇస్తున్నారు. అగ్రిమెంట్‌లో అడ్వాన్స్‌గా 50 వేల నుంచి లక్ష రూపాయల అద్దె, ఏడాదికి 10 శాతం పెంపు ఉంటుందని పేర్కొనడం వారి తెగింపు తనానికి అద్దం పడుతుంది. ఇక జీహెచ్‌ఎంసీలో పారిశుధ్య విభాగంలో పనిచేసే ఉద్యోగులకు కూడా ఇక్కడ డబ్బాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. చుట్టూ ఉన్న బస్తీవాసులతో పాటు పక్క నియోజకవర్గానికి చెందిన వారు కూడా వ్యాపారాలు పెట్టించి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. మరి ఇప్పటికైనా రెవెన్యూ, హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి డబ్బాలు తొలగించడంతో పాటు ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాలి.



చెరువు ప్రహరీ పక్కన వెలిసిన ఫుట్‌పాత్ వ్యాపారాలు



ఓ వ్యాపారికి సంబంధించిన రెంటల్ అగ్రిమెంట్

కూల్చివేసినా మారని తీరు

చెరువు చుట్టూ వాహనాల రాకపోకలు పెరిగాయి. దీంతో పాటు బస్తీలో స్థిర నివాసాలు ఏర్పాటు కావడంతో కొంతమంది బస్తీ నేతల కళ్లు చెరువు చుట్టూ ఉన్న ప్రహరీపై పడ్డాయి. పాన్ షాప్, పానీపూరీ బండ్లు పెట్టించడం మొదలు పెట్టారు. రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు చూసీచూడనట్టు వదిలేయడంతో క్రమంగా డబ్బాలు వెలిశాయి. స్థానికులే మొదట ఇక్కడ వ్యాపారాలు నిర్వహించుకునేవారు. అయితే భవిష్యత్తులో తీసివేసే అవకాశం ఉండటంతో వారు అక్కడి నుంచి వెళ్లి అద్దెలకు ఇవ్వడం ప్రారంభించారు. రెవెన్యూ అధికారులు పలుమార్లు కూల్చివేతలు చేపటినప్పటికీ ఆక్రమణలు మాత్రం ఆగలేదు. ఆరు నెలల క్రితం హైడ్రా ఏర్పడిన తర్వాత అధికారుల బృందం కొత్త చెరువును సందర్శించింది. అనంతరం రెవెన్యూ అధికారులు డబ్బాలను తొలగించారు. అయితే అక్రమార్కులు ఈ సారి ఏకంగా పక్కా వ్యాపారాలపై దృష్టి సారించారు. సుమారు ఆరు లక్షల రూపాయలు ఖర్చు చేసి కంటైయినర్‌లు కొనుగోలు చేసి వాటిని చెరువు చుట్టూ పెట్టి అద్దెకిస్తున్నారు. వాహనాల సర్వీసింగ్ సెంటర్, మెకానిక్ షాపు, చిరుతిళ్ల వ్యాపారాలు ఇలా ఇప్పటి వరకు సుమారు 40 షాపులు ఏర్పాటయ్యాయి.



మహిళా దినోత్సవంలో పాల్గొన్న సీడీఎంఏ కమిషనర్ డా. శ్రీదేవి తదితరులు

ఐటీపీఐ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

హైదరాబాద్ సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ ఇండియా (ఐటీపీఐ) తెలంగాణ రీజనల్ చాప్టర్ ఉమెన్ ప్లానర్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీఎంఏ కమిషనర్ డాక్టర్ టీకే శ్రీదేవి మాట్లాడుతూ.. వ్యక్తిగతంగా లేదా వృత్తిపరంగా మహిళలు మెరుగైన స్థితిలో ఉన్నారన్నారు. నగరాల ప్రణాళిక, ఆకృతిని టౌన్ ప్లానింగ్ మరింత మెరుగు పరుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉమెన్ ప్లానర్స్ ఫోరం ఛైర్‌పర్సన్ దీప్తి వ్యాస్ ఫోరం కార్యకలాపాలను వివరించారు. అదేవిధంగా ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సంధ్యారెడ్డి, తుహినా సిన్హా, ది హిందూ పత్రిక డిప్యూటీ ఎడిటర్ ఎం.రాము, లైఫ్ క్రిప్ట్‌లోని చీఫ్ సైంటిస్ట్ కె.రవికుమార్ రెడ్డిలతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీపీఐ తెలంగాణ చాప్టర్ ఛైర్మన్ దేవేందర్ రెడ్డి, ఫోరం ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ సుధ, షాలిని తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణను సత్కరిస్తున్న దళిత సంఘాల నేతలు

పబ్బతి శ్రీకృష్ణను సత్కరించిన దళిత సంఘాల నేతలు

ఖైరతాబాద్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వాదిగా గుర్తింపు పొందడంతో పాటు సైన్స్ జెనెటిక్ విభాగంలో పీహెచ్‌డీ చేసి గుండెను కాపాడుకోవడంపై పరిశోధన చేసిన పబ్బతి శ్రీకృష్ణ నేటి యువతకు ఆదర్శప్రాయుడని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కని వెంకటయ్య అన్నారు. ఆదివారం లక్డీకాపూల్ సామ్రాట్ కాంప్లెక్స్‌లోని డాక్టర్ అంబేడ్కర్ రిసోర్స్ సెంటర్‌లో ఆలిండియా సమతా సైనిక్ దళ్, దళిత బహుజన పార్టీ, మాల మహానాడుల సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణకు సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. పాలమూరు జిల్లాలోని పేద దళిత కుటుంబం నుంచి వచ్చి సమాజ జీవన స్థితిగతులపై అధ్యయనం చేయడం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పోరాటం చేయడం అభినందనీయమన్నారు. సత్కార గ్రహీత శ్రీకృష్ణ మాట్లాడుతూ.. ఈ సత్కారం డాక్టర్ అంబేడ్కర్‌కు జరిగిన సత్కారంగా భావిస్తున్నానని, ఆయన లేకుంటే తాను లేనన్నారు. తనలాంటి పేదలు పీహెచ్‌డీ చేయడం కష్టతరంగా మారిందని, ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ నిధులను వినియోగించాలని కోరారు. ప్రతి ఒక్కరూ రైతులను గౌరవించడం నేర్చుకోవాలని, వారికి కనీస మద్దతు ధర ఇవ్వలేనప్పుడు ఏం చేసినా ప్రయోజనం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూడి కృష్ణయస్వరూప్, ప్రొఫెసర్ వెంకటదాసు, విశ్రాంత ప్రొఫెసర్ వెంకటరాజ్యం, సీనియర్ జర్నలిస్టు ఇంద్రవెల్లి రమేష్, ఆలిండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ అధ్యక్షుడు దాసరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలోని శివపార్వతుల విగ్రహాలు మాయం

బంజారాహిల్స్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గర్భగుడిలోని శివపార్వతుల ప్రతిమలను దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గురుమూర్తినగర్‌లోని వినాయక ఆలయంలో ఆదివారం ఉదయం పూజ చేసేందుకు వచ్చిన అర్చకుడు నవీన్‌కుమార్‌కు దేవుళ్ల పంచలోహ విగ్రహాలు కనిపించలేదు. ఈ మేరకు పంచలోహ విగ్రహాలను దొంగలు చోరీ చేశారని ఆలయ ఈవో నరేందర్ రెడ్డి ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం



లక్ష్మి

బోరబండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్‌లో జరిగింది. ఎస్‌ఐ తుల్జారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర కాలనీకి చెందిన శ్రీనివాసులు కుమార్తె డి.లక్ష్మి(18) చదువు పూర్తి చేసుకుని ఇంట్లోనే ఉంటోంది. తల్లిదండ్రులు ఊరు వెళ్లిన సమయంలో శనివారం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. లక్ష్మికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుండటంతో ఆమె కుటుంబ సభ్యులు బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



సమావేశంలో పాల్గొన్న బస్తీ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు

వినాయకనగర్ అభివృద్ధి కమిటీ సభ్యుల సమావేశం

బోరబండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లో ఆదివారం వినాయక్ నగర్ అబ్జర్వేషన్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. బస్తీలో పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసి కొత్తపనులు చేపట్టే విషయమై చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో తీర్మానించారు. కమిటీ సలహాదారు వై.వీరాస్వామి యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు ఎ.మాణిక్యం, కార్యదర్శి ఎం.డేనియల్, కోశాధికారి పి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బి.ఆంజనేయులు యాదవ్, ఎం.అమృత్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ సందడి



ఎంఎస్ మక్తాలో జరిగిన ఇఫ్తార్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ నేత మన్నె గవర్దన్‌రెడ్డి, ముస్లిం నేతలు మహమ్మద్ అజ్జు, హాజీ, జావెద్, ఫయాజ్, ఖాదర్, ముజ్జు తదితరులు

- ఖైరతాబాద్, మార్చి 9(ఆంధ్రజ్యోతి)

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ
- వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న మహిళలకు అవార్డులు అందజేత



వ్యాపారవేత్త, సినీ నిర్మాత ఉషా ముల్పూరికి అవార్డు అందజేస్తున్న లక్ష్మీనారాయణ

బంజారాహిల్స్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మగ పిల్లలు, ఆడ పిల్లలు అని కాకుండా ఇద్దరూ సమానమే అనే ధోరణితో తల్లిదండ్రులు పెంచాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం సారధి స్టూడియోలో నిర్వహించిన తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డ్స్-2025 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడా, సామాజిక, సినీ రంగాలతో పాటు ఇతర రంగాల్లో విశేష సేవలందించిన పలువురు మహిళలకు ఆయన అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజం, దేశం అభివృద్ధి చెందాలంటే మహిళల పాత్ర కీలకమన్నారు. మహిళలకు సముచిత గౌరవం ఇచ్చి సత్కరించుకోవడం అభినందనీయమన్నారు. తెలంగాణ చరిత్రను చూస్తే రాణి రుద్రమదేవి, చాకలి ఐలమ్మ గుర్తుకు వస్తారని ఆయన పేర్కొన్నారు. భారత దేశాన్ని సైతం మనం భారత మాతగా పూజిస్తామన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు జి. కిరణ్ కుమార్, సినీ నటుడు బాబూ మోహన్, సినీ నటి వేస్టర్, యూట్యూబర్ గంగవ్వ, పారా ఒలింపిక్స్ విజేత దీప్తి జీవాంజి, ప్రముఖ గైనకాలజిస్ట్ జయంతి రెడ్డి, తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, హంసవాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ ఎంట్రన్స్ పరీక్ష

హైదరాబాద్ సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) ఎంట్రన్స్ టెస్ట్ ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ.ఘంటా చక్రపాణి పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. ఐ-సెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఎంబీఏ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. త్వరలోనే ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణను అకడమిక్ డైరెక్టర్ ప్రొ.పుష్పా చక్రపాణి, ప్రొ.ఆనంద్ పవార్, పరీక్షల నియంత్రణ అధికారి డా.భోజు శ్రీనివాస్ పరిశీలించారు. మరిన్ని వివరాల కోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్లు www.braouonline.in లేదా www.braou.ac.in చూడాలని సూచించారు.

'చాంపియన్' కోసం ఉత్కంఠగా..



ఎఫ్‌ఎన్‌సీసీ క్లబ్‌లో భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న చాంపియన్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న క్రికెట్ అభిమానులు

- హైదరాబాద్ సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి)

కురుమ కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలి

- కురుమ సంఘాల జేఏసీ డిమాండ్

పంజాగుట్ట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబడిన కురుమ సామాజికవర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర కురుమ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, జేఏసీ ఛైర్మన్ ముత్త సంతోష్ కురుమ అధ్యక్షతన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో జేఏసీ, వివిధ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. తమకు గుర్తింపు లేకుండా పోయిందని, పరిస్థితి ఇలానే ఉంటే రానున్న రోజులలో తమ సామాజికవర్గం కనుమరుగయ్యే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేవారు. గొర్రెలు, మేకలు మేపుతూ సంచార జీవితం గడిపే తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని, వరంగల్ మామ్నూర్‌లో నిర్మించనున్న విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. తమ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వాటా కల్పించాలని, ఉన్న ఒక ఎమ్మెల్యేకు మంత్రి వర్గంలో స్థానం కల్పించి మరొకరికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలన్నారు. కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ కులం జనాభా 40 లక్షలకు పైగా ఉంటే 5.5 లక్షలని ఎలా చెబుతారని వారు ప్రశ్నించారు. సంఘం అధ్యక్షుడిగా చలామణి అవుతున్న ఓ వ్యక్తి తమ కులానికి చెందిన ఆస్తులను అనుభవిస్తున్నారని, ఆయన తమకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజులలో పాదయాత్ర, బస్సు యాత్ర చేపట్టి తమ కులస్తుల్లో చైతన్యం తీసుకొస్తామని, త్వరలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి తమ సత్తా చాటుతామన్నారు. తెలంగాణ హక్కుల వేదిక ఛైర్మన్ కోశిక శ్రీనివాస్ కురుమ, సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు వి.రమేష్ కురుమ, ప్రధాన కార్యదర్శి చిలంపల్లి రమేష్ కురుమ, గొర్రె, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.మలిశెట్టి కురుమ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న రాష్ట్ర కురుమ సంఘాల జేఏసీ నాయకులు

కారులో చెలరేగిన మంటలు

- ప్రమాదం నుంచి బయటపడిన నలుగురు వ్యక్తులు



ప్రమాదంలో దగ్ధమైన కారు

పంజాగుట్ట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగిన సంఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కారులో ఉన్న వారు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన గణేష్ ఈ నెల 8న రాత్రి భీమవరంలో ముగ్గురు ప్రయాణికులను మారుతి షిఫ్ట్ డిజైర్ కారులో ఎక్కించుకుని కూకట్‌పల్లికి బయలుదేరాడు. ఆదివారం తెల్లవారుజామున పంజాగుట్ట ప్రధాన రహదారిలోని ఎర్రమంజిల్ విద్యాసాగర్ రావు భవనం వద్దకు రాగానే కారు ఇంజన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో కారును నడుపుతున్న గణేష్ అప్రమత్తమై కారులో ఉన్న వారిని కిందికి దించి తాను కూడా దిగాడు. కొద్దిసేపటికే మంటలు కారు మొత్తం వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని మంటలను అదుపు చేశారు. దూరప్రాంతం నుంచి రావడంతో కారు ఇంజన్ వేడెక్కి మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. గణేష్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'బహురూపులవాడు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చినవీరభద్రుడు, శ్రీనివాస్, చక్రధర్ తదితరులు

పంజాగుట్ట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రచయిత కల్లూరి భాస్కరం రాసిన బహురూపులవాడు పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం రాత్రి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ప్రముఖ రచయిత తాడి ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి, కవి, రచయిత వాడ్రేవు చిన వీరభద్రుడు, డాక్టర్ బలుసు శ్రీనివాస్, డాక్టర్ విరించి విరివింటి, డాక్టర్ గోవిందరాజు చక్రధర్ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాయ్‌ని తొలిచి బంగారం తీసిన హైన్రిశ్ ష్లీమన్ జీవిత చరిత్ర ఆధారంగా రాసిన ఈ పుస్తకంలో తను పుట్టి పెరిగిన ప్రాంతం నుంచి ప్రపంచ మానవుడిగా ఎదగడానికి ప్రయత్నం చేసిన విధానం ఇందులో వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రచయితలు, పాత్రికేయులు, కవులు పాల్గొన్నారు.

అనువాద గ్రంథాలు ఆవిష్కరణ



అనువాద గ్రంథాలను ఆవిష్కరిస్తున్న నరసింహప్ప తదితరులు

ఖైరతాబాద్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యాన్ని ఇతర భారతీయ భాషల్లోకి అనువదింపజేస్తున్న భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఇన్‌కం ట్యాక్స్ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప అన్నారు. ప్రముఖ కవి డా.బిక్కి కృష్ణ అధ్యక్షతన ఐఎల్‌టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని దక్షిణ భారత హిందీ ప్రచార సభలో ప్రముఖ రచయిత్రి డా.మామిడాల శైలజ,యువ కవి ధృవ నల్లా రాసిన అనువాద గ్రంథాల ఆవిష్కరణ సభ, మహిళా దినోత్సవం నిర్వహించారు.ముఖ్య అతిథిలుగా హాజరైన నరసింహప్ప, తెలుగు వన్ ఎండీ కంఠంనేని రవిశంకర్ పుస్తకాలను ఆవిష్కరించారు. మామిడాల శైలజ రాసిన 'గతి తప్పిన రుతువు నవల ఆంగ్లంలో "ది ఎక్స్ ఆఫ్ సైలెన్స్" పేరుతో హిందీలో అవికసిత్ పేరుతో అనువాదం కావడం మంచి పరిణామమని వక్తలు కొనియాడారు. యువ కవి ధృవ తెలుగులో రాసిన రెండు రంగుల ఇంద్ర ధనుస్సు హిందీలో "దో రంగోంకా ఇంద్రధనుష్" పుస్తకాలు బాగున్నాయని కంఠంనేని రవిశంకర్ అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త ఆలూరు సుభాష్ బాబుకు 'విద్య, ఉద్యోగ ప్రదాత' పేరుతో జాతీయ జీవన సాఫల్య లెజెండరీ పురస్కారాన్ని ప్రదానంచేశారు. అనంతరం పలువురు మహిళలకు జాతీయ జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు.

388 ద్విచక్ర వాహనాలపై కేసులు

హైదరాబాద్ సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఒకేసారి 388 ద్విచక్ర వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడిపినట్లు గుర్తించారు. త్రీ వీలర్ 17, ఫోర్ వీలర్ 70, భారీ వాహనాలు 3 చొప్పున ఉన్నాయని పోలీసులు తెలిపారు. మద్యం తాగిన వారిలో 21-40ఏళ్ల మధ్య వయస్సు వారే 359 మంది ఉన్నారు. తరచూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మద్యం తాగి వాహనాలను నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తున్నా వారిలో మార్పు రావడం లేదని పోలీసులు పేర్కొంటున్నారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరుస్తున్నామని, వారికి శిక్షపడేలా చేస్తున్నా కేసులు తగ్గడం లేదన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేసి ప్రమాదానికి కారణమైతే పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

మతిస్థిమితం లేని వృద్ధుడి అదృశ్యం


భాస్కర్

అడ్డగుట్ట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్సై నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ మారేడుపల్లి అజాద్ చంద్రశేఖర్ నగర్‌కు చెందిన రాట్నంపోలు భాస్కర్(60) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఇటీవల మూడు సార్లు ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగొచ్చాడు. ఈ నెల 4న భార్య పనికి వెళ్లి ఉదయం 11:30 నిమిషాలకు ఇంటికి వచ్చింది. ఇంట్లో భర్త భాస్కర్ కనిపించకపోవడంతో పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. తన భర్త కనిపించడం లేదని భార్య పద్మ ఈనెల 7న రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బోరబండలో యువతి..


లక్ష్మి

బోరబండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్‌లో జరిగింది. ఎస్ఐ తుల్జారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర కాలనీకి చెందిన శ్రీనివాసులు కుమార్తె డి.లక్ష్మి(18) చదువు పూర్తి చేసుకుని ఇంట్లోనే ఉంటోంది. తల్లిదండ్రులు ఊరు వెళ్లిన సమయంలో శనివారం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. లక్ష్మికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుండటంతో ఆమె కుటుంబ సభ్యులు బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

నిజాంపేట్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి రూ.5వేల నగదు, 5సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ ప్రాంతంలోని ఇందిరమ్మ కాలనీలో పేకాట ఆడుతున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేశారు.

ఆలయంలోని శివపార్వతుల విగ్రహాలు మాయం

బంజారాహిల్స్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గర్భగుడిలోని శివపార్వతుల ప్రతిమలను దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గురుమూర్తినగర్‌లోని వినాయక ఆలయంలో ఆదివారం ఉదయం పూజ చేసేందుకు వచ్చిన అర్చకుడు నవీన్‌కుమార్‌కు దేవుళ్ల పంచలోహ విగ్రహాలు కనిపించలేదు. ఈ మేరకు పంచలోహ విగ్రహాలను దొంగలు చోరీ చేశారని ఆలయ ఈవో నరేందర్ రెడ్డి ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

కారులో చెలరేగిన మంటలు

- ప్రమాదం నుంచి బయటపడిన నలుగురు వ్యక్తులు


మంటల్లో కాలిపోయిన కారు

పంజాగుట్ట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగిన సంఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కారులో ఉన్న వారు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన గణేష్ ఈనెల 8న రాత్రి భీమవరంలో ముగ్గురు ప్రయాణికులను మారుతి షిఫ్ట్ డిజైర్ కారులో ఎక్కించుకుని కూకట్‌పల్లికి బయలుదేరాడు. ఆదివారం తెల్లవారుజామున పంజాగుట్ట ప్రధాన రహదారిలోని ఎర్రమంజిల్ విద్యాసాగర్ రావు భవనం వద్దకు రాగానే కారు ఇంజన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో కారును నడుపుతున్న గణేష్ అప్రమత్తమై కారులో ఉన్న వారిని కిందికి దింపి తాను కూడా దిగాడు. వారు దిగిన కొద్ది సేపటికే మంటలు కారు మొత్తం వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. దూర ప్రాంతం నుంచి రావడంతో కారు ఇంజన్ వేడెక్కి మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. గణేష్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైళ్లలో ఇద్దరు మహిళల మంగళసూత్రాలు చోరీ

బర్కత్‌పుర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సిగ్నల్ కోసం ఆగిన రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఇద్దరు మహిళల మంగళ సూత్రాలను దొంగలు లాక్కోని పారిపోయారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లో నివాసం ఉంటున్న హారిక బెంగళూరులో మైసూరు ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి కాచిగూడకు వస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో గద్వాల్ రైల్వే స్టేషన్ సమీపంలోని మానుపాడువద్ద రైలు సిగ్నల్ కోసం ఆగింది. ఇదే అదనుగా భావించిన దొంగ హారిక మెడలోని నాలుగు తూలాల బంగారు మంగళ సూత్రాన్ని లాక్కోని పారిపోయాడు. మరో సంఘటనలో శ్రీకాకుళంకు చెందిన హేమలత తిరుపతి నుంచి కాచిగూడకు రావడానికి వెంకటాద్రీట రైలు ఎక్కింది. ఆదివారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో గద్వాల్ రైల్వేస్టేషన్ సమీపంలోని మానుపాడువద్ద రైలు సిగ్నల్ కోసం ఆగింది. ఇదే అదనుగా భావించిన దొంగ హేమలత మెడలోని రెండు తూలాల బంగారు మంగళ సూత్రాన్ని రైలు బోగి కిటికిలోనుంచి లాక్కోని పారిపోయాడు. ఈ రెండు సంఘటనలపై బాధిత మహిళలు కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



కవాడిగూడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని 55 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు ఆదివారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ ఎస్ఐ నిరంజన్ తెలిపిన వివరాల ప్రకారం... 55 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి ట్యాంక్‌బండ్‌పై ఉన్న విద్యుత్ పోల్ నంబర్ 73-75 మధ్య చనిపోయి ఉన్నాడని దోమలగూడ పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు నాలుగు ఐదు రోజులుగా ట్యాంక్‌బండ్‌పైనే సంచరిస్తున్నాడని తెలిపారు. శనివారం రాత్రి పడుకొని నిద్రలోనే చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పోలీసులకు గాని లేదా ఫోన్ నంబర్ 9441309339లో సమాచారం అందించాలని కోరారు.

- ప్రధాన రోడ్డుపై వాహనాల మధ్య నడక
- భయాందోళనలో పాదచారులు
- కంచెతో ఫుట్‌పాత్ మూసివేసిన ట్రాఫిక్ పోలీసులు
- రూ. 5 మూత్ర విసర్జన ఉచితం చేయాలి..
- ఫుట్‌పాత్‌ను తెరవాలంటున్న పాదచారులు
- పే అండ్ యూజ్ టాయిలెట్లను వినియోగించుకోని ప్రయాణికులు

మూత్రం చేస్తున్నారని మూసివేశారు..


ముళ్లకంచెతో మూసివేసిన ఫుట్‌పాత్

రెజిమెంటల్‌బజార్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై మూత్ర విసర్జన చేస్తున్న వారిని నివారించకుండా ఫుట్‌పాత్‌ను మూసివేసి చేతులు దులుపుకున్నారు. దీంతో పాదచారులు నిత్యం ప్రధాన రోడ్డు మీద వాహనాల మధ్య నుంచి భయంతో వెళ్లాల్సిన పరిస్థితిని కల్పించారు. ట్రాఫిక్ పోలీసులు రోప్ నిబంధనను అమలు చేస్తూ ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలిగిస్తూ పాదచారులు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటుంటే ఇక్కడ మాత్రం ముళ్ల కంచె ఏర్పాటు చేసి ఉన్న ఫుట్‌పాత్ మూసివేయడం గమనార్హం.

ఒలిఫెంటా వంతెన కింద ఫుట్‌పాత్

చిలకలగూడ చౌరస్తా- రేతిఫైల్ బస్ స్టేషన్ మధ్య ఉన్న ఆర్వోబీ వంతెన(ఒలిఫెంటా వంతెన) ద్వారా పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 10 నెంబర్ ప్లాట్‌ఫామ్ వైపు దిగిన రైలు ప్రయాణికులతో పాటు చిలకలగూడ చౌరస్తాలో బస్సుదిగిన ప్రయాణికులు, హమాలి బస్తీ, చిలకలగూడ, పద్మారావునగర్, గాంధీ ఆస్పత్రి వైపు నుంచి రేతిఫైల్ బస్ కాంప్లెక్స్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ముందు ఉన్న బస్‌షెల్టర్లలో బస్సులు ఎక్కి, దిగే వారు ఈ వంతెన ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. కొన్ని రోజుల క్రితం వంతెన కింద నుంచి పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌ను మూసివేశారు. ఏవరూ వెళ్లకుండా కంచె ఏర్పాటు చేశారు.





వాహనాల మధ్య నడుచుకుంటూ వస్తున్న పాదచారులు, పక్కనే ఉన్న పబ్లిక్ టాయిలెట్

మూత్ర విసర్జన చేస్తున్నారని..

సికింద్రాబాద్ రైల్వే రిజర్వేషన్ కాంప్లెక్స్ గేట్ నుంచి ప్రారంభమయ్యే ఫుట్‌పాత్ మీద మూత్ర విసర్జన చేస్తున్న వారిని కట్టడి చేయకుండా మూసి వేశారు. బహిరంగ మూత్ర విసర్జనతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్వాసన వచ్చేది. అయినా ప్రత్యామ్నాయం చూపకుండా మూసివేయడం సరికాదు. మూత్ర విసర్జనను నివారించడానికి గోడపై మూడు భాషల్లో మూత్ర విసర్జన చేయరాదంటూ రాసినా కూడా అలాగే కొందరు మూత్ర విసర్జన చేస్తుండడంతో ముళ్ల కంచెతో మూసి వేశారు. దీంతో పాదాచారులు రోడ్డు మీద నడవాల్సివస్తోంది.

ఫుట్‌పాత్‌ను ఓపెన్ చేయాలి



హమాలీబస్తీలో ఉంటాను. బస్తీ నుంచి రైల్వే స్టేషన్, మోండా మార్కెట్ వైపు కాలేజీలు, ఇతర పనుల నిమిత్తం వెళ్లే వారు ఒలిఫెంటా బ్రిడ్జి కింద నుంచి వెళ్తంటారు. బ్రిడ్జి కింద నుంచి వెళ్లే ఫుట్‌పాత్‌ను కొన్ని రోజులుగా మూసివేశారు. దీంతో రోడ్డు మీదనే వెళ్లాల్సివస్తోంది. బ్రిడ్జి కింద ఇరుకుగా ఉండడం, భారీగా వాహనాల రద్దీ, వాటి మధ్య వెళ్లాలంటే భయమేస్తోంది.

- వెంకటేష్, హమాలీ బస్తీ

పరిశీలిస్తున్నాం..



ఫుట్‌పాత్ ఏ శాఖ వారు మూసివేసి ముళ్లకంచె ఏర్పాటు చేశారో తెలుసుకొని చర్చిస్తాం. పాదచారుల రక్షణ కోసం ఫుట్‌పాత్ మీద నుంచి వెళ్లేలా చర్యలు తీసుకుంటాను. వాహనాల మధ్య నుంచి పాదచారులు వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటోంది. పరిశీలించి చర్యలు తీసుకుంటాను.

- శంకర్ రాజు, ఏసీపీ, నార్త్‌జోన్ ట్రాఫిక్

మూత్ర విసర్జనకు రూ.5

పక్కనే పది అడుగుల దూరంలో పే అండ్ యూజ్ టాయిలెట్లు ఉన్నప్పటికీ మూత్ర విసర్జనకు రూ.5 వసూలు చేస్తుండడంతో అందులోకి వెళ్లకుండా ఫుట్‌పాత్ పైనే మూత్ర విసర్జన చేస్తున్నారు. మూత్ర విసర్జనను ఉచితం చేస్తే ఫుట్‌పాత్ పైన ఎవరూ వెళ్లరు. ఇది ఆలోచించకుండా ఫుట్‌పాత్‌ను మూసివేయడం ఏంటని పాదచారులు ప్రశ్నిస్తున్నారు. ఫుట్‌పాత్ గోడ పై మూత్ర విసర్జన చేయరాదని రాశారు.. కానీ, పక్కనే మూత్రశాలలు ఉన్నాయనే విషయం మాత్రం రాయలేదు. మూత్రశాలల విషయం రాయడం వల్ల కొంత వరకు బహిరంగ మూత్ర విసర్జనను నివారించవచ్చు.

ఏ బస్తీకి వెళ్లినా సమస్యలే


అడ్డగుట్ట డివిజన్‌లో పర్యటించిన కాంగ్రెస్ నేత సంతోష్ కుమార్

అడ్డగుట్ట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లో ఏ బస్తీకి వెళ్లినా సమస్యలే కనిపిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ తెలిపారు. ఆదివారం అడ్డగుట్ట డివిజన్‌లోని కట్టెల మండి, ఇందిరానగర్, డీ కాలనీ, సీ కాలనీ శేషపహాడ్ ఏరియాలోని బస్తీ బాట కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులతో పాటు బస్తీ వాసులు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పలు బస్తీల్లో డ్రైనేజీ, మంచినీటి, విద్యుత్, కంకర తేలిన రోడ్లు, ఇతర సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ బస్తీవాసులు ఆదం దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రాంతాల్లో ఎక్కడే ఏ సమస్యల ఉన్నా వెంటనే ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేస్తామని ఆయన బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంట రాజుసాగర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదం సృజన్, అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు గణేష్ యాదవ్, తార్నాక డివిజన్ నాయకులు అమర్‌నాథ్‌గౌడ్, బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, తార్నాక డివిజన్ అధ్యక్షుడు బ్రహ్మాజీ సీనియర్ నాయకులు పసన్న, మైనారిటీ నాయకులు షకీల్ ఖాన్, మహిళా నాయకురాళ్లు లక్ష్మీ యాదవ్, వరలక్ష్మి, దొమ్మాటి నాగమణి పాల్గొన్నారు.

ఉచిత హెల్త్ క్యాంప్



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్షుదిరామ్ మెమోరియల్ డయాబెటిక్ కంపాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మాణికేశ్వర్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఉచిత డయాబటిక్ హెల్త్ చెకప్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కందర్ డయబెటిస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.దిలీప్ కుమార్, బీజేపీ నాయకులు వెంకటేశ్ గౌడ్, రాముపర్మ, డా.మోనాలిసా, డా.కేశవి పాల్గొన్నారు.

- తార్నాక, మార్చి 9(ఆంధ్రజ్యోతి)



లాల్‌బజార్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మురళీ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

- తిరుమలగిరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి)



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 1982వ బ్యాచ్‌కు చెందిన మహబూబ్‌నగర్ బీఈడీ కాలేజీ పూర్వ విద్యార్థులు ఆదివారం ప్రముఖ సామాజిక కార్యకర్త డా.లక్కరాజు నిర్మలను తార్నాకలోని తన నివాసంలో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురభి భూపతి రావు, బెజ్జారపు వేణుగోపాల్, బండారి పద్మావతి, మీసాల రాజేంద్రప్రసాద్, ఎండీ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, మార్చి 9(ఆంధ్రజ్యోతి)

సైన్స్ ఫెయిర్


నమూనాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ దంపతులు

అడ్డగుట్ట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభ ఎంత అవసరమో సైన్స్ ఫెయిర్ అంతే ముఖ్యమని తుకారాంగేట్‌లోని విద్యావాహిని హైస్కూల్ ప్రిన్సిపల్ డైరెక్టర్ గోపాల కృష్ణ విద్యార్థులకు సూచించారు. శని, ఆదివారం జరిగిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు చంద్రయాన్, కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో పాటు తెలంగాణ ప్రభుత్వ ప్రాజెక్ట్‌లపై ప్రదర్శన ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభ ఉన్నప్పుడు విద్యార్థులు అనుకున్నది సాధిస్తారన్నారు. కార్యక్రమంలో టీచర్ సంధ్యతో పాటు టీచర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


అధ్యక్షుడు బాజీబాబా, ప్రతినిధులను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అమీర్‌పేట్‌లోని బుద్ధానగర్ కాలనీకి అధ్యక్షుడిగా ఎన్నికైన బాజీబాబా, కాలనీ వాసులతో ఆదివారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా బాజీబాబాను ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కాలనీలోని సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రవీణ్ రెడ్డి, కాలనీ వాసులు వినోద్, శ్రీను, బిక్షపతి, జహంగీర్, సుమన్, రాము, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ ఎంట్రన్స్ పరీక్ష

హైదరాబాద్ సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) ఎంట్రన్స్ టెస్ట్ ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ.ఘంటా చక్రపాణి పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. ఐ-సెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఎంబీఏ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. త్వరలోనే ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణను అకడమిక్ డైరెక్టర్ ప్రొ.పుష్పా చక్రపాణి, ప్రొ.ఆనంద్ పవార్, పరీక్షల నియంత్రణ అధికారి డా.భోజు శ్రీనివాస్ పరిశీలించారు. వివరాల కోసం విశ్వవిద్యాలయ పోర్టల్‌ను www.braouonline.in లేదా వెబ్‌సైట్ www.braou.ac.in చూడాలని సూచించారు.

పోగొట్టుకున్న బ్యాగును తిరిగి అప్పగింత

- సీసీ కెమెరాల ఆధారంతో కనిపెట్టిన పోలీసులు


దంపతులకు పోగొట్టుకున్న బ్యాగును అందజేస్తున్న సీఐ నాగరాజుగౌడ్

హయత్‌నగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి ఇంటికి వచ్చే క్రమంలో నగలు, నగదుతో ఉన్న బ్యాగును దంపతులు శనివారం ఆటో లో పోగొట్టుకున్నారు. దంపతుల నుంచి ఫిర్యాదు అందుకున్న హయత్‌నగర్ క్రైం పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఆధారంతో ఆటో డ్రైవర్‌ను గుర్తించారు. క్రైం పోలీసులు ఆదివారం బంజారా కాలనీలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ ఇంటికి వెళ్లి నగ లు, నగదుతో ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. దంపతులను పిలిపించి సీఐ నాగరాజుగౌడ్ బ్యాగును అప్పగించారు. వివరాల ప్రకా రం.. మహబూబ్‌నగర్‌కు చెందిన వీర సత్య మల్లేష్, ఆయన భార్య సుష్మలు శనివారం హయత్‌నగర్ సూర్యానగర్‌కాలనీలో నివాసం ఉండే శరత్‌చంద్ర ఇంటికి బయలుదేరారు. హయత్‌నగర్ బజాజ్ షోరూం వద్ద బస్సు దిగిన వారు ఆటోలో సూర్యానగర్‌కాలనీకి వెళ్లారు. ఈ క్రమంలో వారి వద్ద ఉన్న బ్యాగును ఆటోలోనే మరిచిపోయి దిగారు. ఇం టికి వెళ్లి చూసుకునే లోపు ఆటో వెళ్లిపోయింది. వెంటనే వారు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా బంజారాకాలనీకి చెం దిన బూక్యా నాగేశ్వరరావు ఆటోగా గుర్తించారు. వెంటనే పోలీసులు ఆదివారం ఉదయం బూక్యా నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి ప్రశ్నించగా బ్యాగు తన వద్దనే ఉందని చెప్పారు. పోలీసులు సదరు బ్యాగును స్వాధీనం చేసుకుని దంపతులను పిలిపించి వారికి అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ కట్టా వెంకట్‌రెడ్డి, క్రైం పోలీసులు పాల్గొన్నారు.





న్యూజిలాండ్‌తో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత్ విజయం సాధించడంతో నగరంలోని సెక్రటేరియేట్, అమీర్‌పేట్, తదితర ప్రాంతాల్లో క్రికెట్ అభిమానులు, సంబరాలు చేసుకున్నారు. రోడ్లపై జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చారు.



